జ్వాల

# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.
DASHANEWS
.COM

మంగళవారం
26-05-2026

సంపుటి 1 సంచిక 183

పేజీలు : 04

వెల : 1/-

PRGI No :
TGTEL/25/A4195



## విలేకరులు కావలెను

నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.

జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ ఆర్.సీ.ఇన్చార్జులు
మండల రిపోర్టర్స్ క్రైమ్ రిపోర్టర్లు

7337546647
(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)


# తెలంగాణకు వర్ష సూచన..



## చల్లబడనున్న వాతావరణం!

**దశ, హైద్రాబాద్ :** తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. ఎండల తీవ్రతతో ఇబ్బంది పడుతున్న వారికి ఇది నిజంగా ఊరటనిచ్చే వార్త. నైరుతి రుతుపవనాలు వేగం పుంజుకుని, మే 26 నాటికి కేరళ తీరాన్ని తాకనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీనివల్ల రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది.

### తగ్గుతున్న ఎండల తీవ్రత

గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఎండలు, వడగాలులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అయితే ఇప్పుడు వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. నైరుతి రుతుపవనాలు కేరళ చేరుకోగానే, అక్కడి నుండి అవి వేగంగా ముందుకు కదిలి జూన్ మొదటి వారంలోనే తెలంగాణను పలకరించే ఛాన్స్ ఉంది. ఈ మార్పుల వల్ల పగటి ఉష్ణోగ్రతలు తగ్గి, వాతావరణం చల్లబడనుంది. మే 26 నుంచి 29 మధ్య రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు పడే

..మిగతా 4వ పేజీలో →



## కొత్త పీసీసీ చీఫ్ గా పద్మావతి?

**దశ, నల్గొండ:** తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై చూపిస్తున్న శ్రద్ధ, సంస్థాగత బలోపేతంపై చూపించలేదనే విమర్శలు ఉన్నాయి. టీపీసీసీ చీఫ్‌గా మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించి దాదాపు ఏడాదిన్నర గడిచింది. అయినా ఇప్పటివరకు పూర్తి స్థాయి రాష్ట్ర కమిటీని

..మిగతా 4వ పేజీలో →



## రైతులు పండించిన ప్రతి గింజా

# మేం కొంటున్నాం

## సీఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ

**దశ, హైదరాబాద్:** రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. మద్దతు ధరలు ప్రకటించడమే తప్ప కేంద్రం రాష్ట్రంలో పంటను కొనుగోలు చేయడం లేదని, కనీసం 30 శాతం కూడా సేకరించడం లేదని వివరించారు. ముఖ్యమంత్రి తో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సమావేశమైంది. రాష్ట్రంలో సుదీర్ఘ కాలం పెండింగ్ ఉన్న కార్మికుల కనీస వేతనాల పెంపు నిర్ణయంపై ఈ సందర్భంగా ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపింది. సందర్భంగా వివిధ అంశాలపై ముఖ్యమంత్రి స్పందిస్తూ, రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కారణంగా హామాలీలు తరలివెళ్లడంతో ఇక్కడ కొంత కొరత ఏర్పడిందని, అలాగే, ఎండల కారణంగా మధ్యాహ్నం సమయంలో పని జరగడం లేదన్నారు. ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం సమీక్ష చేస్తున్నానని తెలిపారు. సన్నవడ్లకు రూ. 500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తున్నామని, మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మూసీ నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,

..మిగతా 4వ పేజీలో →

# మెట్రోకు రీ ఫైనాన్స్

## ముందుకు వచ్చిన ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (IRFC)

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చేలా కీలక ఒప్పందం కుదిరింది. రూ.13,600 కోట్ల రుణాలను రీఫైనాన్స్ చేయడానికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (IRFC) ముందుకు వచ్చింది. ఈ మేరకు ఢిల్లీలో ఇరు సంస్థల ఉన్నతాధికారులు అధికారికంగా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.ఐఆర్‌ఎఫ్‌సీ సీఎండీ మనోజ్‌కుమార్ దూబె, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సమక్షంలో ఈ డీల్ ఖరారైంది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం రాబోయే 20 ఏళ్ల కాలపరిమితితో, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ రుణాన్ని చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. దీనివల్ల హైదరాబాద్ మెట్రోపై ఉన్న తక్షణ ఆర్థిక భారం తగ్గనుంది.ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు కీలక విషయాన్ని వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టులో 100 శాతం యాజమాన్య వాటా పూర్తిగా ప్రభుత్వానికే బదిలీ అయినట్లు స్పష్టం చేశారు. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.దేశ ఆర్థిక వృద్ధిలో హైదరాబాద్ నగరం కీలక ఇంజిన్‌లా

..మిగతా 4వ పేజీలో →




## వడదెబ్బతో ఒక్కరోజే 76 మంది మృతి..

### ఏపీలో 48.3 డిగ్రీలు, తెలంగాణలో 46.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత!

**దశ, విజయవాడ, హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత రోజురోజుకూ మిన్నంటుతోంది. ఆకాశం నుంచి నిప్పులు కురుస్తున్నట్లుగా ఉష్ణోగ్రతలు నమోదువుతుండటంతో జనం విలవిలలాడుతున్నారు. వడదెబ్బతో ఆదివారం నాడు ఏపీలో 18 మంది, తెలంగాణలో ఏకంగా 58 మంది మృతిచెందం విషాదాన్ని నింపుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో ఏకంగా 48.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారికంగా వెల్లడించింది. దీనితో పాటు

..మిగతా 4వ పేజీలో →

## శత ప్రశ్న శరసంధానం" గ్రంథం ఆవిష్కరణ

**దశ, హైదరాబాద్:** షిర్డీ సాయిబాబాపై ఇటీవల కాలంలో పలువురు వ్యక్తులు చేస్తున్న వివిధ ఆరోపణలకు స్పష్టతనిస్తూ, ప్రామాణిక ఆధారాలతో సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి రచించిన "శత ప్రశ్న శరసంధానం" గ్రంథాన్ని ఘనంగా ఆవిష్కరించారు. నాగిరెడ్డిపల్లిలోని రమణేశ్వరంలో జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా జరిగింది. షిర్డీ సాయిబాబా జీవితం, బోధనలు, ఆధ్యాత్మిక పరంపరపై వస్తున్న సందేహాలు, విమర్శలు మరియు ఆరోపణలకు సమాధానంగా ఈ గ్రంథాన్ని సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. "శత ప్రశ్న శరసంధానం" పేరుతో రూపొందించిన

..మిగతా 4వ పేజీలో →



## ఏసీబీ వలలో ఇరిగేషన్ డీఈఈ

4లో



## ఘనంగా ముగిసిన బాల సంస్కార్ -2026 వేసవి శిభిరం

**దశ, హన్మకొండ:** బాల సంస్కార్ 2026 వేసవి శిభిరం ముగింపు వేడుక జయప్రదం. శ్రీ రామకృష్ణ సేవ సమితి హనుమకొండ ఆధ్వర్యంలో నిర్వహించబడిన బాలసంస్కార్ 2026 నేడు ముగింపు వేడుకతో జయప్రదమైంది. నేటి మాతృ పితృ పాదపూజ మహోత్సవంలో చిన్నారులు నేర్చుకున్న యోగధ్యానం, సాంస్కృతిక ప్రదర్శనలు, సంస్కృత భాష అధ్యయనం,శ్లోక గీతి తదితర అంశాలను సూక్ష్మంగా ప్రదర్శించడం జరిగింది. సమితి అధ్యక్షులు కటంగురు సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభు చైతన్య సంస్కృత అధ్యాపకులు పేట శ్రీనివాస్ స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలనతో నేటి వేడుక ప్రారంభమైంది. నాయిని విశాల్ ట్రస్ట్ ధర్మకర్త దేవన విష్ణువర్ధన్ రెడ్డి ప్రత్యేక అతిథిగా విచ్చేసి వివేకానంద నాబోటి యువతకు స్ఫూర్తి ప్రదాత యని, వారిని ఆదర్శంగా తీసుకున్న బాలబాలికలు జీవితంలో తప్పకుండా విజయం సాధిస్తారని, చిన్నారుల విన్యాసాలు, ప్రదర్శించిన అంశాలు మనసుకు ఆకట్టుకునేలా ఉన్నాయని అన్నారు. పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర గూర్చి ప్రముఖ మానసిక నిపుణులు శివప్రసాద్ ప్రధాన వక్తగా హాజరై పిల్లల పోషకులకు మార్గదర్శనం

..మిగతా 4వ పేజీలో →

## యువజన & క్రీడల శాఖ 99 రోజుల కార్యాచరణకు

# రాష్ట్రంలో విశేష స్పందన

### యువత శక్తికి దిశా నిర్దేశం చేసిన "యువజన & క్రీడల వారోత్సవాలు"

4లో

### క్రీడలు - నైపుణ్యం - నాయకత్వం - ఉపాధి... ఆరు రోజుల మహోత్సవం విజయవంతం






## ఇదేనా ప్రజా పాలన

### తాండూరులో అంబులెన్స్ ఘటనపై హరీశ్ ఫైర్

**దశ, హైదరాబాద్:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైద్య సేవలు కుప్పకూలాయని మాజీ మంత్రి హరీష్ రావు ట్విట్టర్ వేదికగా ఆరోపించారు. తాండూరులో

..మిగతా 4వ పేజీలో →




## గ్రామ పంచాయితీలకు భారీగా నిధులు

**దశ, హైదరాబాద్:** తెలంగాణలోని గ్రామీణ స్థానిక సంస్థల బలోపేతానికి కేంద్ర 16వ ఆర్థిక సంఘం భారీగా నిధులను కేటాయించింది. 2026 27 ఆర్థిక సంవత్సరం నుంచి 203031 వరకు ఐదేళ్ల కాలానికి గాను రాష్ట్రానికి రూ.9,968 కోట్లను నిర్దేశించింది. ఈ నిధుల వినియోగం, పర్యవేక్షణ, పారదర్శకతపై కేంద్ర ప్రభుత్వం

..మిగతా 4వ పేజీలో →

జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..
మంగళవారం 26-05-2026
స్టేట్ న్యూస్
WWW.DASHANEWS.COM

# 'సింగిల్ రాజు' టైటిల్, గ్లిమ్స్ విడుదల చేసిన వేణు ఉడుగుల

**హైదరాబాద్:** టాలీవుడ్‌లో మరో అందమైన గ్రామీణ ప్రేమకథ ప్రేక్షకుల ముందుకు రానుంది. విశ్వస్, మౌనిక, దివ్య ప్రధాన పాత్రల్లో, ఎస్.ఎస్.వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సింగిల్ రాజు'. విభిన్నమైన టైటిల్‌తో ఇప్పటికే ఆసక్తి రేకెత్తిస్తున్న ఈ సినిమా టైటిల్ పోస్టర్, గ్లిమ్స్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దర్శకుడు, నిర్మాత వేణు ఉడుగుల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా 'సింగిల్ రాజు' టైటిల్ పోస్టర్‌తో పాటు గ్లిమ్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వేణు ఉడుగుల మాట్లాడుతూ.. "ఎస్.ఎస్. వర్మ, విశ్వస్ ఇద్దరూ నాకు ఎంతో ఇష్టం. ఈ సినిమా కథ వినగానే చాలా ఇంట్రస్టింగ్‌గా అనిపించింది. ఎంతో ధృడ సంకల్పంతో ఈ సినిమాను ప్రారంభించారు. చాలా బాగా తెరకెక్కిస్తున్నారు. చిత్ర యూనిట్ మొత్తం మంచి కష్టపడి పనిచేస్తోంది. ఈ సినిమా పెద్ద విజయాన్ని అందుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని తెలిపారు. దర్శకుడు ఎస్. ఎస్. వర్మ మాట్లాడుతూ.. "వేణు ఉడుగుల అన్న సపోర్ట్ లేకపోతే ఈ సినిమా సాధ్యమయ్యేది కాదు. ఈ సినిమా కోసం నాకంటే ఎక్కువగా మా అమ్మానాన్నలు కష్టపడ్డారు. ప్రేక్షకులను తప్పకుండా



అలరించే మంచి ఎంటర్‌టైనర్‌గా 'సింగిల్ రాజు' నిలుస్తుందనే నమ్మకం ఉంది" అన్నారు. హీరో విశ్వస్ మాట్లాడుతూ.. "దర్శకుడు ఎస్.ఎస్. వర్మ మేము ఎంతో ఫ్యాషన్ తో చేస్తున్న సినిమా. విలేజ్ లో షూటింగ్ జరుగుతున్నప్పుడు అక్కడ అందరూ సపోర్ట్ చేశారు. మా సినిమా ను ప్రతి ఒక్కరు ఆదరించాలని కోరుకుంటున్నాం." అని అన్నారు. హీరోయిన్లు మౌనిక, దివ్య మాట్లాడుతూ.. మా సినిమా అందరికి నచ్చుతుందనే నమ్మకం ఉంది. విలేజ్ బ్యాక్ గ్రౌండ్ లో జరిగే కథలో అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి. డైరెక్టర్ కు థాంక్స్. టీమ్ అందరూ సపోర్ట్ చేశారు. అని అన్నారు. టైటిల్ లోగోలో కనిపిస్తున్న 'బ్రోకెన్ హార్ట్' ఎమోజీని బట్టి ఈ చిత్రం యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. త్వరలోనే నటీనటులు, ఇతర విశేషాలను చిత్ర బృందం అధికారికంగా ప్రకటించనుంది.

### సాంకేతిక విభాగం:

దర్శకత్వం: ఎస్.ఎస్. వర్మ
పాటలు: గోరటి వెంకన్న, మిట్టపల్లి సురేందర్
ఛాయాగ్రహణం: సాయితేజ కుందారపు, నితీష్
ఎడిటింగ్: యునిక్ బొజ్జపల్లి
ప్రొడక్షన్ డిజైనర్: రాజ్ మామిడి
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రాఘవేందర్ వర్మ
సీఈఓ: శివ వర్మ సుంకరి
క్రియేటివ్ పబ్లిసిటీ: గణేష్ రత్నం
పీఆర్వో & డిజిటల్ : మమత రెడ్డి కాసం, అశోక్ దయ్యాల

## యువజన & క్రీడల శాఖ కార్యాచరణకు

# రాష్ట్రంలో విశేష స్పందన

**దశ, హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా నిర్వహించిన 99 రోజుల కార్యాచరణలో యువజన & క్రీడల శాఖ చేపట్టిన "యువజన & క్రీడల వారోత్సవాలు" రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన పొందాయి.

మే 18 నుండి 23 వరకు నిర్వహించిన ఈ ఆరు రోజుల కార్యక్రమాలు యువతలో శారీరక దారుఢ్యం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడమే కాకుండా క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేశాయి. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలలో యువజన సేవలు మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలు నిర్వహించగా యువజన సంఘాలు, క్రీడాకారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు మరియు సాధారణ ప్రజలు భారీగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

మే 18.. "ఫిట్ & యాక్టివ్ తెలంగాణ"తో ఉత్సాహభరిత ఆరంభం వారోత్సవాల తొలి రోజు "ఫిట్ & యాక్టివ్ తెలంగాణ" పేరిట రాష్ట్రవ్యాప్తంగా మారథాన్‌లు, వాక్‌థాన్‌లు, యోగా, ధ్యానం, ఏరోబిక్స్, జుంబా కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించబడ్డాయి. హైదరాబాద్ ఎల్.బి. స్టేడియంలో జరిగిన 5 కిలోమీటర్ల మారథాన్‌కు యువత పెద్ద సంఖ్యలో హాజరైంది. జిల్లా కేంద్రాల్లో మారథాన్‌లు, మండల కేంద్రాల్లో వెల్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించగా కలెక్టర్లు, ఎస్పీలు, ప్రజాప్రతినిధులు స్వయంగా పాల్గొని యువతను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

మే 19.. కెరీర్ & నైపుణ్యాభివృద్ధి దినోత్సవం
యువతకు ఉపాధి దిశగా మార్గనిర్దేశం చేయాలనే లక్ష్యంతో నైపుణ్యాభివృద్ధి కోర్సులు, స్పోర్ట్స్ యూనివర్సిటీ అవకాశాలు, స్కిల్ యూనివర్సిటీ ప్రోగ్రాములు, అగ్నివీర్ నియామకాలపై రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ప్రత్యేక వర్చువల్ సెషన్‌లు నిర్వహించారు. విద్యార్థులు, యువత భారీగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో పద్మభూషణ్ పుల్లెల గోపీచంద్, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ డాక్టర్ సోనీ బాలాదేవి పాల్గొని "ఫిజికల్ లిటరసీ" ప్రాధాన్యంపై చేసిన సందేశం యువతలో చైతన్యాన్ని నింపింది.

*మే 20.. *యువజన నాయకత్వ సమ్మేళనం*లో యువత ఆలోచనలకు వేదిక.. యువతలో నాయకత్వం, సృజనాత్మకత, సామాజిక అవగాహన పెంపొందించేందుకు "యూత్ లీడర్‌షిప్ సమ్మిట్" మరియు "యువజన పార్లమెంట్ సమావేశాలు" నిర్వహించారు. విద్యాసంస్థలు, యువజన సంఘాల భాగస్వామ్యంతో జరిగిన ఈ కార్యక్రమాల్లో యువత సామాజిక అంశాలపై చర్చలు జరిపింది. సోషల్ మీడియా ప్రభావం, క్రీడల ద్వారా నైపుణ్యాల పెంపుదల, కుటుంబం - కెరీర్ సమతుల్యత, యువతకు అందుబాటులో ఉన్న క్రీడా అవకాశాలపై విద్యార్థులు, యువకులు చర్చాగోష్టులు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

మే 21 "ప్లే & పార్టిసిపేట్ - స్పోర్ట్స్ డే"
రాష్ట్రవ్యాప్తంగా వివిధ స్టేడియాలు, క్రీడా మైదానాల్లో క్రీడా మరియు వినోద కార్యక్రమాలు నిర్వహించి యువతలో సామూహిక భాగస్వామ్యాన్ని పెంపొందించారు. జిల్లా యువజన మరియు క్రీడాధికారుల పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో యువత, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఎండీ డాక్టర్ సోనీ బాలాదేవి స్వయంగా క్రీడల్లో పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించడం విశేషంగా నిలిచింది.

మే 22.. "సర్వ్ & సపోర్ట్"తో స్వచ్ఛ యువత అంకితం
యువతలో సామాజిక బాధ్యత పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు.
క్రీడా మైదానాలు, పార్కులు, చెరువులు, ఓపెన్ ప్రదేశాల్లో యువజన స్వచ్ఛంద సేవకులు, క్రీడాకారులు, ఎన్‌జీవోలు, ప్రజాప్రతినిధులు కలిసి శ్రమదానం చేశారు.
ఎల్.బి. స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో స్పోర్ట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ డాక్టర్ సోనీ బాలాదేవి పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

మే 23.. "ఉద్యోగ సాధన"తో వేలాది యువతకు అవకాశాలు
వారోత్సవాల చివరి రోజు యువతకు ఉపాధి అవకాశాలపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. మే 1 నుండి 12 వరకు వివిధ జిల్లాల్లో నిర్వహించిన జాబ్ మేళాల్లో దాదాపు 40 వేల మంది యువకులు నమోదు చేసుకోగా, 22 వేల మందికి పైగా ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఇందులో 11,200 మంది అభ్యర్థులు షార్ట్‌లిస్ట్ కాగా, దాదాపు 5,700 మందికి వివిధ సంస్థల నుండి నియామక పత్రాలు అందజేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
అదేవిధంగా వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఘనంగా సత్కరించారు.

## రైతులు పండించిన ప్రతి గింజా కొంటున్నాం

**మొదటి పేజీ తరువాయి**

స్థానికంగానే నివాసాలు మంజూరు చేస్తామన్నారు. ఈ విషయంలో పార్టీలు రాజకీయం చేయడం తగదన్నారు. మూసీ పునరుజ్జీవం చేసి అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని అన్నారు. మూసీ కాలుష్యం వల్ల నల్గొండ జిల్లా ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిందని, అక్కడ ఎదురవుతున్న పరిస్థితులను వివరించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు వల్ల యువతకు ఉపాధి లభించడమే కాకుండా నగర ప్రజల జీవన విధానం మెరుగవుతుందని చెప్పారు. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తున్నామని, చేపడుతున్న కార్యక్రమాలను వారికి వివరించారు. నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని, అందులో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్ఫాస్ట్, భోజనం అందిస్తున్నాం తెలిపారు.

## కొత్త పీసీసీ ఛీఫ్‌గా పద్మావతి?

**మొదటి పేజీ తరువాయి**

ప్రకటించలేదు. కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, అన్నింటికీ మించి కీలకమైన వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం వాయిదా పడుతూ వస్తోంది. అయితే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ఈ ప్రతిష్ఠంభనకు తెరదించేందుకు అధిష్ఠానం కసరత్తు ముమ్మరం చేసిందిముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ నేతృత్వంలో గాంధీభవన్ వేదికగా ఈ నియామకాలపై తుది నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ కమిటీ కసరత్తులో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న ప్రధానమైన పేరు.. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్. వాస్తవానికి ఆమె కేబినెట్ హోదాతో కూడిన కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఆశించినట్లు గాంధీభవన్ వర్గాల్లో టాక్ నడిచింది. అయితే, ఇప్పటికే ఆమె భర్త ఉత్తమ్ కుమార్ రెడ్డి మంత్రివర్గంలో కీలకమైన నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రిగా కొనసాగుతున్నారు. ఒకే ఇంటికి రెండు కేబినెట్ ర్యాంక్ పదవులు ఇస్తే పార్టీలోనే కాకుండా, ప్రజల్లోనూ ప్రతికూల చర్చకు దారితీస్తుందని అధిష్ఠానం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఆమెకు ప్రభుత్వ పదవి కాకుండా, పార్టీలో అత్యంత కీలకమైన వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని పెద్దలు వ్యూహం రచించారు.పద్మావతి రెడ్డికి ఈ పదవి ఇవ్వడం వెనుక అధిష్ఠానం అనేక సామాజిక, రాజకీయ లెక్కలను వేస్తోంది.

## గ్రామ పంచాయితీలకు భారీగా నిధులు

**మొదటి పేజీ తరువాయి**

స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ నిధులను కేవలం గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా ప్రజా పరిషత్‌లలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, గ్రామీణ రహదారులు, స్ట్రీట్ లైట్‌ల ఏర్పాటు వంటి ప్రజా సేవల కోసమే వినియోగించాలని కేంద్రం స్పష్టం చేసింది. అయితే ఈ గ్రాంట్లను ఎలాంటి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల చెల్లింపుల కోసం ఉపయోగించరాదని ఖచ్చితమైన నిబంధన విధించింది.నిధుల దుర్వినియోగానికి తావులేకుండా ఉండేందుకు కేంద్రం కఠినమైన పర్యవేక్షణ నిబంధనలను తెచ్చింది. ప్రతి స్థానిక సంస్థ ఎప్పటికప్పుడు తమ వ్యయ వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని పేర్కొంది. త్రైమాసిక, వార్షిక పురోగతి నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలని, వాటి ఆధారంగా సమగ్ర నివేదికలను రాష్ట్రం కేంద్రానికి సమర్పించాలని ఆదేశించింది. ఆడిట్‌లో ఏవైనా లోపాలు గుర్తిస్తే తక్షణమే సరిదిద్దాలని, అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని దీనిపై తగిన పరిపాలన ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.ఐదేళ్ల కాలానికి ఆర్థిక సంఘం దేశం మొత్తానికి రూ.4,35,236 కోట్లను గ్రాంట్లుగా ప్రకటించింది. ఇందులో 80 శాతం నిధులు నేరుగా పంచాయతీలకు, 10 శాతం మండల పరిషత్‌లకు, మరో 10 శాతం జిల్లా పరిషత్‌లకు దక్కుతాయి. ఈ నిధులను ఏటా జూన్, అక్టోబర్ నెలల్లో రెండు విడతల్లో విడుదల చేస్తారు. అయితే మొత్తం నిధుల్లో 20 శాతం నిధుల విడుదలను పనితీరు ఆధారంగా కేంద్రం నిర్ణయిస్తుంది. రాష్ట్రాలు స్థానిక సంస్థలకు ఏ మేరకు ఆర్థిక వనరులు సమకూరుస్తున్నాయనే అంశంపై రాష్ట్ర పనితీరును, పన్నుల వసూళ్లు, సొంత ఆదాయ వనరుల పెంపుదల ఆధారంగా పంచాయతీల పనితీరును పరిగణనలోకి తీసుకుంటారు. 2026 నాటి అంచనాల ప్రకారం గ్రామీణ జనాభాకు 90 శాతం, రాష్ట్ర వైశాల్యానికి 10 శాతం వెయిటేజీ ఇచ్చారు. ఈ లెక్కన తెలంగాణ గ్రామీణ జనాభాకు 1.92 శాతం, వైశాల్యానికి 0.37 శాతం చొప్పున మొత్తం రూ.9,968 కోట్ల నిధులు దక్కాయి.మొదటి విడత నిధుల విడుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి కేటాయించిన బడ్జెట్ వివరాలతో పాటు, 202526 ఆర్థిక సంవత్సరం నాటి స్థానిక సంస్థల ఆడిట్ నివేదికలను సమర్పించాల్సి ఉంటుంది. మొదటి విడత నిధుల వినియోగ ధ్రువీకరణ, పురోగతి ఆధారంగానే రెండో విడత నిధులు విడుదలవుతాయి.

## ఇదేనా ప్రజా పాలన

**మొదటి పేజీ తరువాయి**

అంబులెన్స్ రాక రైల్వే ప్లాట్‌ఫారమ్‌పై మహిళ ప్రసవించడం, భద్రాచలంలో వాహనం లేక మృతదేహాన్ని భుజాలపై మోసుకెళ్లడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో పేదల కోసం తెచ్చిన 108 అంబులెన్స్, పరమపద వాహనాలను నిర్వీర్యం చేశారని మండిపడుతూ.. ప్రజలు కోరుకున్న ప్రజా పాలన ఇదేనా అని ప్రశ్నించారు. తక్షణమే అత్యవసర సేవలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.తెలంగాణలో కాంగ్రెస్ప్ర భుత్వం ప్రతిష్టాత్మకంగా చెప్పుకుంటున్న ప్రజా పాలనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీష్ రావు సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సంరక్షణ వ్యవస్థ తీవ్రంగా అస్తవ్యస్తమైందని పేదప్రజలప్రాణాలకురక్షణకరువైందనిఆయనఆందోళనవ్యక్తంచేశారు.ఇటీవల తాండూరు మరియు భద్రాచలం ప్రాంతాల్లో చోటుచేసుకున్న రెండు వేర్వేరు హృదయవిదారక సంఘటనలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టారు. ఈ మేరకు ఆయన చేసిన ట్వీట్ చేశారు.'వికారాబాద్ జిల్లా తాండూరులో ఒక నిరుపేద గర్భిణీ స్త్రీ ప్రసవ వేదనతో తల్లడిల్లుతూ అత్యవసర సహాయం కోసం 108 అంబులెన్స్ సేవలకు పలుమార్లు ఫోన్ చేసింది. అయితే ఎన్నిసార్లు పిలిచినా అంబులెన్స్ సకాలంలో స్పందించకపోవడంతో విధిలేక ఆమె రైల్వే ప్లాట్‌ఫారమ్‌పైనే బిడ్డకు జన్మనివ్వాల్సి వచ్చింది. ఒక గర్భిణీకి కనీస వైద్య రవాణా సదుపాయం కల్పించలేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి పరాకాష్ట' అని హరీష్ రావు దుయ్యబట్టారు. అలాగే భద్రాచలంలో జరిగిన మరో సంఘటన అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఒక నిరుపేద కుటుంబంలో వ్యక్తి మరణిస్తే మృతదేహాన్ని గౌరవప్రదంగా స్వగ్రామానికి తరలించేందుకు భద్రాచలం ఏరియా ఆసుపత్రి యాజమాన్యం కనీసం ఒక ఉచిత అంబులెన్స్ కూడా సమకూర్చలేదన్నారు. దీనితో ఆ పేద కుటుంబ సభ్యులు తమ బంధువు శవాన్ని భుజాలపైనే మోసుకుంటూ వెళ్లాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రతికున్నప్పుడు ప్రాణాలు కాపాడటానికి అంబులెన్స్‌లు లేవు.. చనిపోయాక కనీస మానవీయ గౌరవంతో తీసుకెళ్లడానికి వాహనాలు లేవని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు.గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పేద, నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు 108 అత్యవసర సేవల వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు మృతదేహాలను ఉచితంగా తరలించేందుకు పరమపద వాహన సేవలను ప్రవేశపెట్టామని హరీష్ రావు గుర్తుచేశారు.

## ఏసీబీ వలలో ఇరిగేషన్ డీఈఈ

**దశ, వరంగల్:** నీటిపారుదల శాఖలో డీఈఈ గా పనిచేస్తున్న గంటి శ్రీకాంత్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు. పాలకుర్తిలో పని చేస్తున్న శ్రీకాంత్ ఒక కంట్రాక్టర్ నుంచి 50 వేల రూపాయలు లంచం తీసుకుంటున్నప్పుడు ఏసీబీ దాడి చేసింది. హన్మకొండలోని భవానినగర్ లో నివాసంలో ఈ దాడి జరిగింది. శ్రీకాంత్ ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

## ఘనంగా ముగిసిన బాల సంస్కార్ -2026 వేసవి శిభిరం

**మొదటి పేజీ తరువాయి**

చేశారు. సమితి ఆశయాలను కార్యక్రమాలను వాటి నిర్వహణ ఆవశ్యకత గురించి అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి వివరించారు. ప్రభు చైతన్య మాట్లాడుతూ పిల్లల్లో సంస్కారాలు నింపాలంటే తల్లి ఒక భక్తురాలిగా తండ్రి ఒక యోగిలా గురువు ఒక జ్ఞానిలా ఉన్నప్పుడే పిల్లలను సంస్కారవంతులుగా తీర్చిదిద్దగలరని అన్నారు. నేడు సాహితీసాంస్కృతిక పోటీలలో గెలుపొందిన విజేతలకు, ప్రదర్శనలు చేసిన చిన్నారులకు జ్ఞాపికలను, మూర్తిత్రయ భావజాల సాహిత్యాన్నిబహుకరించారు. సేవా సమితి క్రియాశీల సభ్యులు చిదర అంజనీ దేవి, పడిదల అనిత, పూలమ్మ, లక్ష్మిదేవి, లక్ష్మి రావు, కె.వి.రావు, సూర్య, కార్యకర్తలు అనిల్, రఘు, నరేష్ శ్రీకాంత్, గణేష్, పిల్లల తల్లితండు)లు, తదితర పరిసర కాలనీల వాసులు సుమారు 250 మంది ఈ కార్యక్రమాలు పాల్గొన్నారు. చివరగా ప్రసాద పంపిణీ జరిగింది.

## శత ప్రశ్న శరసంధానం" గ్రంథం ఆవిష్కరణ

**మొదటి పేజీ తరువాయి**

ఈ పుస్తకాన్ని సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి మొత్తం 11 భాషల్లో రచించడం విశేషం. భక్తుల్లో నెలకొన్న అనేక సందేహాలకు చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రామాణిక ఆధారాలతో సమగ్ర వివరణ ఇవ్వడమే ఈ గ్రంథం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి తెలంగాణతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖ షిర్డీ సాయి దేవాలయాల నిర్వాహకులు, ట్రస్టు సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సాయి మందిరాల ప్రతినిధులు మాట్లాడుతూ, సాయిబాబాపై అసత్య ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి ప్రసంగిస్తూ, ఏ ఆధ్యాత్మిక మహానుభావుడి గురించి అయినా అవగాహన లేకుండా విమర్శలు చేయడం సమాజంలో అయోమయానికి దారితీస్తుందని అన్నారు. సాయిబాబా జీవితం మానవత్వం, సేవాభావం, సమానత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. భక్తుల సందేహాలకు సమగ్ర సమాధానంగా ఈ గ్రంథాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. రమణేశ్వరంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా ముగిసింది.

## తెలంగాణకు వర్ష సూచన..

**మొదటి పేజీ తరువాయి**

అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. సాధారణంగా జూన్ ఆరంభంలో రావాల్సిన రుతుపవనాలు ముందుగానే రావడం వ్యవసాయ రంగానికి సానుకూల అంశం. ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతున్న రైతులకు ఈ వర్షాలు ఎంతో మేలు చేయనున్నాయి. రానున్న రోజుల్లో గాలిలో తేమ పెరిగి, ఉక్కపోత నుంచి ఉపశమనం లభించనుంది.

## వడదెబ్బతో వ్యక్తి మృతి

**దశ, రంగారెడ్డి జిల్లా:** పెద్ద అంబర్‌పేట్ మండలం పసుమాముల గ్రామానికి చెందిన కూకట్లపల్లి ప్రభు (38) వడదెబ్బకు గురై మృతి చెందిన ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, ప్రభు నిన్న మధ్యాహ్నం తీవ్ర ఎండలో బయట పనులకు వెళ్లగా అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిసింది. ప్రభు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికులు, బంధువులు కుటుంబ సభ్యులకు పరామర్శలు తెలియజేశారు.

## మెట్రోకు రీ ఫైనాన్స్

**మొదటి పేజీ తరువాయి**

మారుతోందని సీఎస్ పేర్కొన్నారు. మెట్రో రైలు కనెక్టివిటీని మరింత విస్తరించడం ద్వారా నగరంలో ట్రాఫిక్ రద్దీ చాలావరకు తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రీఫైనాన్స్ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వం, ఐఆర్ఎఫ్‌సీ, ఎల్అండ్‌టీ, హెచ్ఎంఆర్ఎల్ బృందాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## వడదెబ్బతో ఒక్కరోజే 76 మంది మృతి..

**మొదటి పేజీ తరువాయి**

పల్నాడు జిల్లా పిడుగురాళ్ల, పశ్చిమగోదావరి జిల్లా తణుకుల్లో 48.1 డిగ్రీలు, ఏలూరు జిల్లా కుక్కునూరు, పోలవరం జిల్లా కూనవరంలో 47.3 డిగ్రీలు, కృష్ణా జిల్లా నందివాడలో 47.1 డిగ్రీల చొప్పున అత్యధిక ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్రంలోని మొత్తం 17 జిల్లాల్లోని దాదాపు 174 మండలాల్లో పగటి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల మార్కును దాటేశాయి.

### అనకాపల్లి పిడుగులతో కూడిన వర్షాలు

ద్రోణి ప్రభావంతో ప్రకాశం, మార్కాపురం, కర్నూలు, నంద్యాల, అనంతపురం,చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి, మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మన్యం, అల్లూరి, పోలవరం, అనకాపల్లి, రాయలసీమ జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. దహేగాం మండలంలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత.. మరోవైపు తెలంగాణలోనూ ఎండల తీవ్రత విపరీతంగా పెరిగింది. రాష్ట్రంలోనే అత్యధికంగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండలం కుంచవెల్లిలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం వెల్గనూర్‌లో 46.4 డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 46.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కాలంలో ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు, తగినన్ని నీళ్లు తీసుకోవాలని అధికారులు ప్రజలను కోరారు. వేసవి కాలంలో పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతలు, నిప్పు రవ్వల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వరుస అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయని పొన్నం ఆందోళన వ్యక్తం చేశారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com